# హాత్

సెలవు రోజు వస్తే ఏమీ తోచదు. ఏ పనీ లేకపోతే గది కన్నా ఆఫీసే నయం అనిపిస్తుంటుంది. ఆఫీసులో సమయం తేలికగా గడిచిపోతుంది. గదిలో పడుకుందామన్నా నిద్రపట్టటం లేదు. నవల తీసి నాలుగు పేజీలు చదివానో లేదో మెట్లమీద అలికిడి వెనక శిఖామణి గదిలోకి వచ్చి కుర్చీ నేను పడుకున్న మంచం దగ్గరకు లాక్కుని కూర్చుని, "శ్రీనూ! నాకో సహాయం చేసిపెట్టాలి" అన్నాడు.

పుస్తకం మూసి లేచి కూర్చుని, "చెప్పు" అన్నాను.

"విస్కీ కావాలి."

ఉలిక్కిపడ్డాను. ఇటువంటి సహాయం నా నుండి కోరుకుంటాడని నేనెప్పుడూ అనుకోలేదు. సిగరెట్ వెలిగించాను. నమ్మనట్లు తల అడ్డంగా ఆడించి, "నిజంగానా?" అడిగాను.

"నిజంగా అడుగుతున్నాను. నా మనసేం బాగోలేదు. విస్కీయే కాదు, మనసు నాలోంచి వెళ్ళిపోవటానికి ఏదయినా నన్ను ఇంటాక్సికేట్ చేసేది కావాలి."

శిఖామణి నాకో కొత్త వ్యక్తిలా అవుపిస్తున్నాడు. నాకు ఉన్న స్నేహితుల్లో మంచి వాడతను. అతనంటే గౌరవం నాకు. చెడు అలవాట్లంటూ ఏమీలేవు. కనీసం సిగరెట్ అయినా ముట్టుకోడు. అటువంటి వాడికి హఠాత్తుగా విస్కీ తాగాలనే ఆలోచన ఎందుకు కలిగిందో నాకు అర్థం కావటం లేదు.

"ఇది హైదరాబాద్ కాదు. ఇక్కడెలా దొరుకుతుంది?"

"నువ్వు తలుచుకుంటే సంపాయించగలవు. నాకు కావాలి."

"శాంత దగ్గిరనుండి ఉత్తరాలు రావటం లేదా?"

"టాపిక్ మార్చకు. ఇంతవరకు ఏదీ ఎప్పుడూ నిన్ను అడగలేదు. నువ్వు అడిగితే కాళిదాసు కాదనడు" అతను గుర్తు చేసేవరకు ఆ విషయం నాకు తట్టలేదు. మా ఆఫీసుతో కాళిదాసుకు పని ఉండటం వలన, అందులో అతని ఎకౌంట్స్ నేను చూస్తుండటం

వలన నాకు అతనితో బాగా పరిచయం ఉంది. వాళ్ల మెస్‌కు నన్ను చాలాసార్లు పిలిచాడు కాని నేనెప్పుడూ వెళ్ళలేదు. అతనికి పర్మిట్ ఉందని తెలుసు. అతనికి ముప్ఫయి అయిదు సంవత్సరాలుంటాయి. మంచి జీతం వస్తుంటుంది. మనిషెప్పుడూ టిప్‌టాప్‌గా ఉంటాడు. ఇంతవరకు ఎందుచేతనో పెళ్ళిచేసుకోలేదు.

శిఖామణిని నాగదిలోనే ఉండమని చెప్పి సైకిలు తీసుకుని కాళిదాసు క్వార్టర్సుకు బయల్దేరాను. అక్కడినుండి అరగంట ప్రయాణం. సమయానికి కాళిదాసు ఇంట్లోనే ఉన్నాడు. ఆర్డర్లీ చేత కాఫీ చేయించి బిస్కెట్లతో పాటు ఇచ్చాడు. కొద్దిసేపు మాట్లాడిన తర్వాత నేను వచ్చిన విషయం చెప్పాను. "నువ్వు తీసుకుంటావని నాకు తెలియదు" అన్నాడు. నాకోసం కాదు అందామనుకున్నాను కాని అనలేదు. "ఎప్పుడయినా ఒకసారి" అన్నాను.

"ఏ బ్రాండ్ కావాలి?"

"ఏదయినా పరవాలేదు."

"ఈ సాయంత్రం మెస్‌లో డ్రా చేస్తాను. రేపు సాయంత్రం వచ్చి తీసుకెళ్ళు."

జేబులోంచి డబ్బులు తీస్తూ, "ఎంతవుతుంది?" అడిగాను.

"డబ్బులొద్దు. నీకు గిఫ్ట్‌గా ఇస్తున్నాను."

"రేపు సాయంత్రం ఎన్ని గంటలకు రమ్మంటారు?"

"ఆఫీసు నుండి సరాసరి ఇటు వచ్చేయి" అన్నాడు.

గదికి చేరుకునేసరికి శిఖామణి నా మంచం మీద పడుకుని సిగరెట్ కాలుస్తున్నాడు. అప్పటికే చాలా సిగరెట్లు కాల్చినట్టున్నాడు, యాష్‌ట్రే సిగరెట్ పీకలతో నిండిపోయి ఉంది.

"ఇచ్చాడా?" అడిగాడు లేచి కూర్చుని.

"రేపు మెస్‌లోంచి డ్రా చేసి ఇస్తానన్నాడు."

"ఇవ్వడు. రేపు కూడా ఇవ్వడు."

"నీ పరిస్థితి నాకేం అర్థం కావటం లేదు. ఈ సిగరెట్లేమిట్రా... ఏం జరిగిందో చెప్పు.... నువ్వేదో దాస్తున్నావు" అన్నాను.

బాధగా నవ్వి ఏదో చెబుదామనుకున్నాడనుకుంటాను. చెప్పలేదు.

మరుసటి రోజు సాయంత్రం ఆఫీసు నుండి సరాసరి కాళిదాసు క్వార్టర్స్‌కు వెళ్లాను. అతను అప్పుడే ఎక్కడికో బయల్దేరబోతున్నాడు.

"తీసుకు వచ్చారా?"

"అరె... మర్చిపోయాను. ఈ రాత్రికి తప్పకుండా తెచ్చిపెడతాను. రేపు ఉదయాన్నే వచ్చి తీసుకెళ్ళు. నేను లేకపోయినా ఆర్డర్లీ నడిగి తీసుకెళ్లు" అన్నాడు.

ఆ రాత్రి పదిదాటిన తర్వాత శిఖామణి గదికి చేరుకున్నాడు. ఈ రెండు రోజుల్లో మనిషి బాగా నలిగి పోయాడు. ఎప్పుడూ నీటుగా ఉండే అతని గుడ్డలు మాసిపోయి ఉన్నాయి. గదిలోకి వస్తూనే "తెచ్చావా?" అడిగాడు.

తల అడ్డంగా ఆడించి, "మర్చిపోయాడట. రేపు తప్పకుండా ఇస్తానన్నాడు" అన్నాను.

శిఖామణి స్నానం చేసి గుడ్డలు మార్చుకుని తన మంచం మీద పడుకుని సిగరెట్ వెలిగించి, "నాకెందుకో చచ్చిపోదామనిపిస్తుందిరా" అన్నాడు.

నా నిద్ర ఎగిరిపోయింది. లేచి కూర్చుని, "ఏమయింది నీకు? నాక్కూడా చెప్పకూడని విషయమా? సమస్యలు అందరికీ ఉంటాయి. నాకూ ఉన్నాయి. కాకపోతే మనం ఒకరికి సమస్య కాకూడదు. చెప్పు. ఏం జరిగింది? నువ్వు బాధ పడుతుంటే నాకూ బాధగా ఉంది...." అన్నాను. అతనేదో చెప్పబోయి ఆగి రెండుచేతుల్లో ముఖం కప్పుకుని వెక్కివెక్కి చాలాసేపటివరకు ఏడుస్తూ ఉండిపోయాడు. అతన్ని ఓదార్చటానికి నాకే ధైర్యం చాలలేదు.

మరుసటిరోజు ఉదయం కాళిదాసు ఇంటికి వెళ్లాను. నన్ను చూడగానే "సారీ మాస్టర్. నిన్న పనుల తొందర్లో తీసుకురాలేకపోయాను. ఈ సాయంత్రం తప్పకుండా తెస్తాను." అన్నాడు కాళిదాసు నా చేతిలో చేయివేసి. నాకోసమయితే అన్నిసార్లు వెళ్లి ఉండేవాడినికాదు. సాయంత్రం మళ్లీ కాళిదాసు ఇంటికి వెళ్లాను. ఇంట్లో కాళిదాసులేడు. ఆర్డర్లీని అడిగితే అతను ఎక్కడకు వెళ్ళాడో తెలియదన్నాడు. విస్కీ గురించి కూడా ఏమీ తెలియదన్నాడు. గదికి చేరుకునేసరికి శిఖామణి మత్తులో పడుకుని ఉన్నాడు. బల్లమీద త్రీస్టార్స్ విస్కీ సీసా సగం ఖాళీ అయి ఉంది.

నాలుగు రోజుల తర్వాత ఆఫీసు నుండి సాయంత్రం గదికి తిరిగి వచ్చేసరికి బల్లమీద పౌడరు డబ్బా కింద చిన్న ఉత్తరం ఉంది. అందులో "శ్రీనూ! చెప్పకుండా వెళ్లిపోతున్నందుకు ఏమనుకోకు. అనుకోకుండా నా జీవితం ఎందుకు మలుపు తిరిగిందో నాకే అర్థం కావటం లేదు. మా ఊరు వెళ్తున్నాను. నా మనసు నా ఆధీనమయితే తప్పకుండా తిరిగి వస్తాను. పిచ్చివాడిని కాను. చావను. నాకు తెలియకుండా నీకు శ్రమ కలిగించి ఉంటే నన్ను క్షమించు" అని ఉంది. కింద సంతకం లేదు. శిఖామణి

హఠాత్తుగా ఎందుకు వెళ్ళిపోయాడో, ఎందుకలా అయిపోయాడో నా ఊహకు అందలేదు.

రాత్రి తొమ్మిదింటివరకు గదిలో వంటరిగా కూర్చున్నాను. శిఖామణి లేని గది బోసిగా ఉంది. నా ఆలోచనల్లో అతను మాటి మాటికి కదులుతున్నాడు. ఏకాంతం నాకు ఆత్మహత్యలా అనిపిస్తోంటే భరించలేక గదికి తాళం వేసి సినిమాకు బయల్దేరాను. నేను వెళ్ళేసరికి ఆట మొదలయింది. ఒక మూల కూర్చున్నాను.

ఇంకో అయిదు నిమిషాల్లో విశ్రాంతి అనగా నా వెనకనుండి మాటలు వినిపించసాగాయి.

"నేనొకడికి హోత్ ఇచ్చాను" - మగగొంతు.

"దేనికి?" స్త్రీ గొంతు.

"విస్కీ కావాలన్నాడు. రేపు, మాపు, ఇదో అంటూ తిప్పాను. విసుగుపుట్టి రావటం మానేశాడు."

అతను మాట్లాడుతుంది నా గురించే. వెనక్కి తిరిగి చూస్తుంటే లైట్లు వెలిగాయి. ఆ వ్యక్తి కాళిదాసు. ఆ క్షణంలో అతని ముఖం ఎంతో గంభీరంగా ఉన్నా కత్తివేటుకు నెత్తురు చుక్క ఉండదనిపించింది. నేను అందుకు నిరుత్తరుడిని కాలేదు కాని అతని పక్కన ఉన్న స్త్రీ, శాంత!

◆ ఆంధ్ర సచిత్ర వార పత్రిక - 13 మే 1966